క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు


ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులు నిర్వహించారు. కుమార స్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

సన్మానం


పదోన్నతిపై వెళ్లిన చర్చి గురువు దంపతులను సన్మానిస్తున్న సంఘ పెద్దలు

నందికొట్కూరు: మండల పరిధిలోని వడ్డేమాన్ సీఎస్ఐ చర్చి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ చర్చిప్రాస్టేట్ చైర్మన్ కిరణ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి గురువు పదోన్నతిపై వెళ్లిన రెవరెండ్ ఇమ్మానియేల్ బాబు దంపతలును సంఘ పెద్దలు ఘనంగా సన్మానించారు.

అంజన్నకు వడలతో అలంకరణ


వడలు అలంకరించిన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలో మంగళవారం అమావాస్య కావడంతో అభయాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మౌని అమావాస్య, శని జయంతి రెండు కలిసి రావడంతో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు అనిల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని 5 వేల వడలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై కర్నూలు జిల్లా పుల్లగుమ్మి గ్రామానికి చెందిన శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున భజన సేవా సమితి వారి భజన కార్యక్రమం ఆకట్టుకుంది. గణపతి ప్రార్థన, లింగాష్టకం, శివదేవుని మందిరం, శివశివ శంకరా, శంభో హరహర మహాదేవ, శ్రీశైలవాస, పార్వతీనాథుడా, పాతాళగంగమ్మ, కైలాసవాసుని, భ్రమరాంబమాతకు జయ మంగళం తదితర భక్తిగీతాలను, భజనకీర్తనలను పి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శివారెడ్డి, భాస్కర్ రెడ్డి, జయమ్మ, నాగలక్ష్మీదేవి, లక్ష్మీదేవి తదితరులు ఆలపించారు.

కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో హోమం


హోమం నిర్వహిస్తున్న ప్రజలు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని లింగాపురం గ్రామంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో మంగళవారం అమావాస్య సందర్భంగా లోక కల్యాణం కోసం హోమం నిర్వహించారు. ముందుగా విగ్రహాలను, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలతో హోమం నిర్వహించి పుణ్యా అవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతులు సమర్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వ్యాధుల కాలం.. జర భద్రం

- వాతావరణ మార్పులతో అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- చిన్నారులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి
- జ్వరం, బలహీనత, కళ్లు తిరగడం వంటి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి

బండిఆత్మకూరు: ఇటీవల వాతావరణం భిన్నంగా ఉంటోంది. మధ్యాహ్నం వరకు మండుటెండ ఉంటూ అప్పటికప్పుడు ఆకాశం మేఘావృతమై వర్షం పడుతోంది. కొన్ని రోజులుగా ఎండ వేడిమితో పాటు ఉక్కపోత అధికమైంది. ఉదయం 7 గంటలకల్లా భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. సాయంత్రం 5 అయ్యేసరికి చల్లబడి గాలులు వీస్తున్నాయి. ఒక్కోసారి వర్షాలు పడుతున్నాయి. ఈ విధంగా జరిగే వాతావరణ మార్పులతో చిన్నపిల్లలు, వయసు మళ్లిన వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాతావరణ మార్పులతో ఎదురయ్యే సమస్యలు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యులు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

ఇబ్బందులు ఇవే..

ఒకేరోజు అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలు పడుతూ చల్లబడిన వాతావరణంతో మొక్కల నుంచి పుప్పొడి రేణువులు గాలిలో కలుస్తాయి. దీంతో ఆస్తమా, ఎలర్జీ, గొంతునొప్పి, తుమ్ములు ఎక్కువగా రావడం, న్యూమోనియా, బ్రాంకైటీస్, ముక్కు కారడం వంటి సమస్యలు వస్తాయి. వాతావరణంలో అధిక ఉష్ణోగ్రత, తేమ ఉన్నప్పుడు చెమట పట్టి ఫంగస్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ రావడానికి అవకాశం ఉంటుంది. నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెంది వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మైగ్రేన్ వంటి సమస్యలు ఉన్న వారికి మరింత ఇబ్బందిగా ఉంటుంది. చిన్న పిల్లలు, వృద్ధుల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో త్వరగా వడదెబ్బకు



గురవుతారు. సోడియం, పొటాషియం లవణాల సమతుల్యతలో తేడా ఏర్పడి ఇబ్బంది పడతారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాలి, వెలుతురు బాగా వచ్చేలా చూసుకోవాలి. దీంతో గాలి నుంచి వచ్చే ఇన్‌ఫెక్షన్లను నివారించవచ్చు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం మంచిది. వృద్ధులు మండుటెండలో తిరగకూడదు. రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలి. నూనె పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. దాహం వేయకున్నా ప్రతి అరగంటకు కొద్దిగా మంచి నీరు తాగుతూ ఉండాలి. రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు విటమిన్-సి ఎక్కువగా ఉండే సిట్రస్ పళ్ల రసాలు, తాజా కూరగాయలు తీసుకోవాలి.

నిర్లక్ష్యం చేయొద్దు



జ్వరం, బలహీనత, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దు. ఇలాంటి సమయంలో సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించి వైద్యసేవలు పొందాలి. వైద్యులు సూచించిన మందులు మాత్రమే వాడాలి. సామాజిక మాధ్యమాల్లో చూసిన వాటిని అనుసరించకూడదు. అందరి శరీర తత్వాలు ఒకేలా ఉండవు. తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.

– భావనారెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు, బండిఆత్మకూరు

పన్ను పెంపు సర్వేను నిలిపేయాలి

ఆత్మకూరు: ఇంటి పన్ను పెంపు కోసం రాష్ట్రంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేను తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ గత ఏప్రిల్ నుంచి పెంచాలనుకున్న 15 శాతం పన్నులు తగ్గించాలని, అనధికార కట్టడాల పేరుతో పేద ప్రజల ఇళ్లపై 25 శాతం నుంచి 100 శాతం వరకు పెనాల్టీ విధింపు నిబంధనలను ఆపాలని కోరారు. కూటమి ప్రభుత్వం యేడాది కాలంలో రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్లు విద్యుత్ బిల్లులతో పాటు పెంచబోయే రూ.1,500 కోట్ల ఆస్తి పన్నుల బాదుడుపై ఈనెల 27 నుంచి జరుగుతున్న మహానాడులో ప్రజలపై భారం పడకుండా రద్దు చేస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, సద్దాంహుసేన్, షేక్ఇస్మాయిల్, ఎ.సురేంద్ర, జి.నాగేశ్వరరావు, వీరన్న, పాతకోట భాస్కర్, జబివుల్లా పాల్గొన్నారు.

హైవే నిర్మాణంపై సీబీఐతో విచారణ చేపట్టాలి

పాములపాడు: నేషనల్ హైవే 340సీ రహదారి నిర్మాణంలో నాణ్యత లోపించిందని, సీబీఐతో విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న హైవే, అండర్ పాస్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 40 గ్రామాలకు సర్వీసు రోడ్డు నిర్మించకుండా నేషనల్ హైవే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. నిర్మాణంలో దృఢమైన కంకర వినియోగించాల్సి ఉండగా ఎస్ఆర్ఎంసీ కాలువ ఎర్ర రాయిని కంకరగా చేసి నిర్మాణంలో వాడారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చెలిమిల్ల సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఎంపీటీసీ సురేష్, లింగాల సర్పంచు మల్లీశ్వరరెడ్డి, నీటిసంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కోట్ల నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్బి వెంకటస్వామి, తదితరులు

శనగల బసవన్నకు పూజలు


శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్ర పాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

జగనన్న కాలనీలో తాగునీటి కొరతను తీర్చండి

నందికొట్కూరు: జగనన్న కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. మంగళవారం పట్టణ సమీపంలోని జగనన్న కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం నుంచి తాగునీరు రావడం లేదని అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నీటి సమస్యతో జగనన్న కాలనీవాసులు అల్లాడుతున్నా, విద్యుత్ సరఫరా లేక కాలనీ అంధకారంలో ఉన్నా అధికారుల్లో చలనం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, డీలరు షాపులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, కాలనీవాసులు షేక్ మహబూబ్, మాలిక్‌బాషా, బాలరాజు, అల్లిమాబీ, మాబాషా, జమాల్ బాషా పాల్గొన్నారు.


జగనన్న కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

● తాగునీరు కలుషితం

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్‌లో ప్రధాన రహదారి పక్కన ఉండే పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు కలుషితమవుతోంది. పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి నాలుగు రోజులవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. సచివాలయానికి కూతవేటు దూరంలో లీకేజీ ఏర్పడినా స్పందించే నాథుడే లేడు. దీనికి తోడు వర్షాలు ఎడతెరిపిలేకుండా కురుస్తున్నండటంతో మురుగునీరంతా పైపులోకి వెళ్లి కులాయిల ద్వారా సరఫరా అవుతోంది. అధికారులు నిత్యం అదే రోడ్డు వెంట తిరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలుషిత నీరు తాగి అతిసార వ్యాధి బారినపడక ముందే మరమ్మతులు చేపట్టి రక్షిత నీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పైప్‌లైన్ లీకేజీతో కలుషితమవుతున్న తాగునీరు

ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధం

నందికొట్కూరు: ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధమని మిడుతూరు మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్య అన్నారు. మంగళవారం మిడుతూరు మోడల్ స్కూల్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక పాల్గొన్నారు.

● నందికొట్కూరు పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశర్మ పాల్గొన్నారు.

● పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ అధ్యక్షతన యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మండల ట్రైనర్లు చందన, గౌసియా బేగం, లక్ష్మీప్రసన్న ఉద్యోగులు, ఆయుష్ సిబ్బందికి యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

● పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల పరిధిలోని ట్రైనర్స్, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శుల చేత మాస్టర్ ట్రైనర్స్ శివకుమార్, మల్లేశ్వరీ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గాయత్రీ పాల్గొన్నారు.

● వెలుగోడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'యోగాంధ్ర' కార్యక్రమంలో నిర్వహించారు. ఆయుష్ డాక్టర్ సురేష్, పీహెచ్‌సీ డాక్టర్, ఎంఈఓ, డిప్యూటీ తహసీల్దార్లు యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంఈఓ బ్రహ్మం నాయక్, హెచ్ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


నందికొట్కూరులో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

ప్రజలకు అవగాహన కల్పించాలి

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ గోపికృష్ణ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి యోగా నేర్చుకోవటంపై ఆసక్తి ఉన్న వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వారిని జూన్ 21న గ్రామసచివాలయం, యోగాసెంటర్, సీఎం పాల్గొనే యోగా ప్రోగ్రాంలో పాల్గొనేలా ఆప్షన్ ఎంపిక చేయించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బుధవారం మోడల్ స్కూల్‌లో యోగాపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఎయిడ్స్‌ను తరిమేదాం

వెలుగోడు: ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దామని మెరీబా సొసైటీ ఆర్గనైజర్ ఈశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మోతుకూరు గ్రామంలో ప్రసాద్ కళాజాతా బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా ఎయిడ్స్, క్షయ వ్యాధిగ్రస్తులైన గర్భిణుల నుంచి శిశువుకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కళాజాతా బృందం సభ్యులు అవగాహన కల్పిస్తారన్నారు.

నేటి నుంచి కాశీవిశ్వేశ్వర స్వామి ప్రతిష్ఠోత్సవాలు


నూతనంగా నిర్మించిన ఆలయం

కొత్తపల్లి: మండలంలోని పెద్ద గుమ్మడాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమాలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని వారు కోరారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


ఉప కారాగారంలో తనిఖీ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి ప్రస్తుతం జైలులో ఉన్న ఖైదీలు బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక ఉప కారాగారంలోని న్యాయ సహాయ కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటి నుంచి రిమాండ్‌లో ఉంటున్నారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన అర్హత ఉన్న ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపకారాగారాధి సెల్వంత్ ఉన్నారు

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఎన్ రాచర్ల గ్రామంలో జూన్ 1వ తేదీ న్యూ క్యాటగిరి విభాగంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమత్సమేత సీతారామ లక్ష్మణ స్వాముల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు వరుసగా రూ.80 వేలు, రూ.60 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15వేలు, రూ. 10 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 95730 82338, 99086 14220 నంబర్లను సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


ఊరేగింపు ఎదుట ఆకట్టుకున్న కోలాటం

వెలుగోడు: గుంతకందాల గ్రామంలోని వినాయక, సరస్వతి దేవి, గరుత్మంతుడు, ఆంజనేయ స్వామి సహిత గోపాలకష్ణ స్వామి విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం గ్రామంలో విగ్రహాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబర్ ఇలియాస్ ఖాన్, మండల ప్రధాన కార్యదర్శి బోగోలు సుదర్శనం పాల్గొన్నారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

రైతులను ప్రోత్సహించండి

ఆత్మకూరు: పండ్ల తోటల పెంపకంపై రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు సిబ్బందికి సూచించారు. కరివేన రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర జీవీఏలో హార్టికల్చర్‌కు ప్రాధాన్యత ఎంతో ఉందని, ఉద్యాన పంటలను సాగు చేసుకోవడం రైతులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఉద్యానశాఖ ద్వారా ఎంఐడీహెచ్, ఆర్‌కెవీవై, ఎన్ఎంఈఓ-ఓపీ, కోకోనట్ బోర్డు, బాంబూ మిషన్ కింద ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై రైతుసేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఫ్యాలో ల్యాండ్‌లలో సాగుకి ఉపయోగంగా ఉన్న నేలలను గుర్తించి వాటిలో పంటలు వేసుకునే లాగా రైతులను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో హార్టికల్చర్ ఆఫీసర్ కె.చందన పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి


మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో నాయకులు

ఆత్మకూరు: పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కార్యకర్తలకు సూచించారు. పార్టీ ఆత్మకూరు పట్టణ మున్సిపల్ సెక్రటరీగా ఎంపికైన షేక్‌రఫిక్ మంగళవారం పార్టీ కార్యాలయంలో శిల్పాను కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. తన ఎంపికకు కారణమైన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిలకు రుణపడి ఉంటానని ఆయన తెలిపారు.

వివాహ వేడుకల్లో శిల్పా

శ్రీపతిరావుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు రబ్బాని కుమారుడి వివాహానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. శ్రీపతిరావుపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రాజామోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, అంజాద్‌అలీ, రాజు, బాలస్వామియాదవ్, రఫిక్, బి.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సబ్ జైల్ తనిఖీ

నంద్యాల(వ్యవసాయం): ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయ సేవా కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మంగళవారం స్పెషల్ సబ్‌జైల్‌ను తనిఖీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల పైబడిన వృద్ధ ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. హెల్ప్‌లైన్ నంబర్ 15100 పై ఖైదీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురు ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ గురుకుమార్ న్యాయవాదులు బాలు నాయక్, శేష సాయిబాబా, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.


మహానందిలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఎడతెరిపినివ్వని వర్షం

మహానంది: మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు ఎడతెరిపినివ్వకుండా వర్షం కురిసింది. మండలంలో 29.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గాజులపల్లె, ఆంజనేయపురం, బసవాపురం తదితర గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లోకి వర్షపునీరు చేరింది.